


# కడప మనస్సాక్షి

తెలుగు దినపత్రిక

KADAPA MANASSAKSHI - Telugu Daily


PRGI Reg.No: APTEL/26/A0309





వైయస్ఆర్ కడప/అన్నమయ్య | ఎడిటర్ : వసంత శ్రీనివాసుల రెడ్డి | సంపుటి : 01 | సంచిక : 241 | శుక్రవారం, 04 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల.రూ.2/-


## సామాజిక మాధ్యమాల్లో యువత చురుకుదనం.. అందుకు తగ్గట్టుగా సిద్ధమవ్వాలి



అమరావతి, సెప్టెంబరు 3: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, కరవు పరిస్థితులు, తాగునీరు, పశుగ్రాసం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. వర్షపాతం లోటు 52 శాతంగా నమోదైన నేపథ్యంలో తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, విత్తన బంతులకు ప్రాధాన్యం పెంచాలని, పశుగ్రాసం కొరత లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కరవు పరిస్థితుల దృష్ట్యా కేంద్రం నుంచి నిధులు రాబట్టే అంశంపైనా చర్చించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువలకు నీరు అందడం పట్ల ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు. మంత్రివర్గ సమావేశానికి ముఖ్యమంత్రి వచ్చిన సమయంలో మంత్రులు లేచి చప్పట్లతో అభినందించారు. మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను చంద్రబాబు అభినందించారు. మంత్రులందరూ ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కొత్త తరం యువత అన్ని అంశాలపై అవగాహనతో సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటోందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం కూడా సిద్ధం కావాలని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను యువతకు చేరవేయాలని సూచించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలని చంద్రబాబు మంత్రులకు సూచించారు. తప్పుడు, నకిలీ ప్రచారాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందుంటుందని విమర్శించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువలకు నీటి విడుదలపై కూడా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ప్రచారాన్ని ప్రజలకు వాస్తవాలను వివరించడం ద్వారా తిప్పికొట్టాలని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు పూర్తయినా అది కూటమి ప్రభుత్వం చేపట్టిన పనుల ఫలితమేనని, ఈ విషయాన్ని ప్రజలు కూడా గమనిస్తున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ధరల నియంత్రణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు ధరల పెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని చంద్రబాబు ఆదేశించారు.

## విశాఖలో ఐఏటీఓ జాతీయ సదస్సు



అమరావతి, సెప్టెంబర్ 3: ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసి స్థానిక పర్యాటక భాగస్వాములకు జాతీయ స్థాయిలో విస్తృత అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విశాఖపట్నం వేదికగా ఈ నెల 10 నుంచి 12 వరకు 41వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ జాతీయ వార్షిక సదస్సు జరగనుందని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర పర్యాటక రంగాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ప్రముఖ పర్యాటక ప్రతినిధులు, టూర్ ఆపరేటర్లు, హోటల్ నిర్వాహకులు, విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్ర పర్యాటక రంగానికి గొప్ప అవకాశమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 2,068 మందికి పైగా సభ్యులతో ఇన్‌బౌండ్ టూరిజం రంగంలో అగ్రగామిగా ఉన్న ఐఏటీఓ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక భాగస్వాముల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఏపీకి చెందిన టూర్ ఆపరేటర్లు, హోటళ్లు, ఇతర పర్యాటక భాగస్వాములు ఐఏటీఓ సభ్యత్వం పొందేందుకు చెల్లించాల్సిన రూ.10 వేలతో పాటు పన్ను వన్‌టైమ్ అడ్మిషన్ ఫీజును పూర్తిగా మినహాయించినట్లు తెలిపారు. ఈ రాయితీ 2026 డిసెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునే వారికి వర్తిస్తుందని చెప్పారు. సాధారణంగా సభ్యులకు రూ.6 వేలు, సభ్యులు కానివారికి రూ.8,500గా ఉన్న సదస్సు రిజిస్ట్రేషన్ ఫీజును ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులకు కేవలం రూ.3 వేలకే తగ్గించినట్లు వెల్లడించారు. ఈ సదస్సుకు దేశ నలుమూలల నుంచి వెయ్యి మందికి పైగా ప్రముఖ టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ సంస్థలు, హోటల్ రంగ ప్రతినిధులు, విమానయాన సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. దీనివల్ల రాష్ట్రంలోని హోటళ్లు, రిసార్టులు, పర్యాటక ప్రాంతాలకు జాతీయ స్థాయిలో ప్రచారం లభించడంతో పాటు ప్రముఖ టూర్ ఆపరేటర్లతో నేరుగా వ్యాపార సంబంధాలు ఏర్పరచుకునే అవకాశం ఉంటుందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని హోటల్, రిసార్ట్ యాజమాన్యాలు, టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెన్సీలు, హోమ్‌స్టే నిర్వాహకులు, రవాణా రంగ ప్రతినిధులు, పర్యాటక మార్గదర్శకులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఐఏటీఓ సభ్యత్వం పొందడంతో పాటు సదస్సులో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## కొండూరు కిడ్నీ బాధితుల జీవితాల్లో కొత్త ఆశలు నింపిన పవన్ కళ్యాణ్

**-జల్ జీవన్ మిషన్--అమరజీవి పథకంతో ఏ.కొండూరుకు శాశ్వత తాగునీటి పరిష్కారం**



ఎన్టీఆర్ జిల్లా, సెప్టెంబర్ 3: దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఏ.కొండూరు మండల ప్రజల జీవితాల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొత్త ఆశలు నింపారని అధికారులు తెలిపారు. ఉద్దానం తరహాలో కిడ్నీ వ్యాధి సమస్య తీవ్రంగా ఉన్న ఏ.కొండూరు ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన జల్ జీవన్ మిషన్--అమరజీవి తాగునీటి పథకం పూర్తయింది. మండలంలోని 21 గ్రామ పంచాయతీలు, 38 ఆవాస ప్రాంతాల్లో దాదాపు కిడ్నీ వ్యాధి ప్రభావం ఉండటంతో ప్రజలు కలుషిత నీటిని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్య 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందే పవన్ కళ్యాణ్ దృష్టికి రాగా, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఏ.కొండూరు ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రూ.49.94 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పథకానికి సంబంధించిన పనులను 26 నెలల కాలంలో పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. సుమారు 130 కిలోమీటర్ల పైప్‌లైన్, 12 ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా 38 ఆవాస ప్రాంతాల్లోని సుమారు 75 వేల మందికి ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించనున్నారు. ఇబ్రహీంపట్నం ఎన్టీపీసీ కాలువ నుంచి కృష్ణా జలాలను తీసుకువచ్చి శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకానికి కనీసం టెండర్ ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో పనులు వేగంగా పూర్తయ్యాయని పేర్కొన్నారు. గతంలో మండల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు ప్రతి సంవత్సరం సుమారు రూ.2.5 కోట్లు ఖర్చయ్యేదని, ప్రస్తుతం శాశ్వత తాగునీటి పథకం పూర్తికావడంతో ప్రజలకు ఎంతో ఉపశమనం లభించనుందని అధికారులు తెలిపారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏ.కొండూరు ప్రాంతాన్ని సందర్శించి తాగునీటి పథకం పనులను, నీటి నాణ్యతను పరిశీలించనున్నట్లు సమాచారం.

## అక్టోబర్‌లోనే స్థానిక ఎన్నికలు.. కొత్త పింఛన్లు



సెప్టెంబరు 3: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో సిద్ధం చేయడంతో పాటు, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్ర మంత్రులతో సమావేశమై చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందించాలని స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిశీలించి, పారదర్శకంగా అర్హులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తి లేదని నారా లోకేష్ స్పష్టం చేశారు. అక్టోబర్ నాటికి సమగ్ర ఎన్నికల ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తామని పేర్కొన్నారు. తొలుత పురపాలక ఎన్నికలు, అనంతరం ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో నిర్వహిస్తామని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం కలిగించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని లోకేష్ విమర్శించారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్య, సంక్షేమం, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారం, సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్‌పై మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సెప్టెంబరు 9తో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై అక్రమ కేసులు నమోదు చేసి నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, అప్పటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యల ద్వారా ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని లోకేష్ మంత్రులకు సూచించారు.

## చెన్నైలో 'ఒలింపిక్ సిటీ'.. ఫార్ములా-1 ట్రాక్!



తమిళనాడు, సెప్టెంబరు 3: చెన్నై నగరాన్ని అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచస్థాయి క్రీడా వేదికలు, శిక్షణ కేంద్రాలు, క్రీడా వైద్యం, శాస్త్ర పరిశోధన సదుపాయాలతో 'ఒలింపిక్ సిటీ' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అలాగే ప్రత్యేక మోటార్ స్పోర్ట్స్ సిటీని నిర్మించి ఫార్ములా-1 నుంచి ఎఫ్-4 వరకు అంతర్జాతీయ రేసులు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. భారత్‌లో ఫార్ములా-1 రేసును తిరిగి నిర్వహించడంతో పాటు అంతర్జాతీయ పోటీల్లో భారత క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టనుంది.

## క్రెడిట్ కొట్టేసేందుకే కూటమి ప్రభుత్వం స్టంట్



అమరావతి, సెప్టెంబర్ 04: వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతోందని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ, వాటిని పోలవరం ప్రాజెక్టు జలాలుగా చూపిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారం చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. పురుషోత్తపట్నం పంపులు కానీ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్మించినవి కావని ఆయన స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరం ఎడమ కాలువకు సంబంధించి 79 శాతం పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో కొత్తగా ఎటువంటి పనులు చేపట్టకుండా, గతంలో పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా లబ్ధి పొందాలని ప్రభుత్వం ఆరాటపడుతోందని జగన్ ఆక్షేపించారు. ప్రజాధనంతో ప్రాజెక్టుల వద్ద ప్రచార కార్యక్రమాలు, పబ్లిసిటీ స్టంట్లు నిర్వహించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు.

కడప మనస్సాక్షి తెలుగు దినపత్రిక
PRGI Reg.No: APTEL/26/A0309
KADAPA MANASSAKSHI - Telugu Daily



# ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి సంబరాలు



రాజంపేట, (మనస్సాక్షి) : రాజంపేట మండలం కొత్తబోయినపల్లి పి.యం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆడిపాడుతూ అందరినీ అలరించారు. అనంతరం నిర్వహించిన ఉట్టి కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వచ్ఛత పక్వాడా పదిహేను రోజుల కార్యక్రమంలో భాగంగా చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. ఓబులేసు, పి. జనార్ధన్, శేషగిరి, రాజయ్య, పి. శ్రీరాములు, శివప్రసాద్ గౌడ్, ఎస్. ప్రభాకరరావు, విజయభాస్కర్, అనిల్, ఎం. చెన్నకేశవులు, సువర్ణసుందరి, అమరావతి, మధువాణి, ప్రణవి, డి. శ్రీనివాసులు ఆచారి, ఎం. సాయినాథ్, ప్రశాంత్, సి.ఆర్.పి. బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో చురుగ్గా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు


**-నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలి.లి**

**-జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం అధికారి వేంపల్లి భాస్కర్.**



మదనపల్లె, (మనస్సాక్షి): జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ, నివారణపై అవగాహన కార్యక్రమాలు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం అధికారి వేంపల్లి భాస్కర్ తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి అధికారి డాక్టర్ ఎల్. రాధిక ఆదేశాల మేరకు దిశా ఆధ్వర్యంలో ఐసీటీసీ కౌన్సిలర్లు, ఏఆర్టీ, ఎన్‌జీవో ప్రతినిధులతో స్థానిక డీహెచ్ఓ కార్యాలయంలో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ ఏఆర్టీ, ఐసీటీసీ, ఎన్‌జీవోలకు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని సూచించారు. లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత నెల 12వ తేదీ నుంచి జిల్లాలోని మార్కెట్లు, పాఠశాలలు, కళాశాలలు, అధిక ప్రమాద ప్రాంత గ్రామాల్లో ఎయిడ్స్‌పై అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు వచ్చే నెల 12వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. రెండు నెలలపాటు హైరిస్క్ గ్రామాలు, కళాశాలలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మిషన్ ఎయిడ్స్ సురక్ష (హీూా) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను ప్రతి స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఎయిడ్స్ పరీక్షలు, కౌన్సెలింగ్, మందుల సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సేవలు అందించాలని స్పష్టం చేశారు. గర్భిణీల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారికి అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో దిశా సిబ్బంది ఆనంద్, సిలార్, కౌన్సిలర్లు జయకుమార్, పుల్లయ్య నాయుడు, చంద్ర మోహన్, ఎన్‌జీవో ప్రతినిధులు అలావల్లి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలి



మదనపల్లె, (మనస్సాక్షి): ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులను కోరారు. మదనపల్లెలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో వైఎస్సార్‌సీపీ తరఫున మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఎస్. నిసార్ అహ్మద్, పట్టణ అధ్యక్షుడు జింకా చలపతి, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్. రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో 1,31,085 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు 93,271 మంది ఓటర్లను విచారించినట్లు అధికారులు వెల్లడించారని నాయకులు తెలిపారు. మిగిలిన ఓటర్ల విచారణను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గాల వారీగా పెండింగ్‌లో ఉన్న విచారణలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. పీలేరు నియోజకవర్గంలో 36.21 శాతం, తంబళ్లపల్లె 34.16 శాతం, పుంగనూరు 30.24 శాతం, రాయచోటి 29.16 శాతం, మదనపల్లె 11.70 శాతం ఓటర్ల విచారణ ఇంకా పూర్తికావాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరుకు తన ఓటు హక్కు కొనసాగేందుకు అవకాశం కల్పించడంతోపాటు, అనర్హులు, నకిలీ లేదా ద్వంద్వ నమోదులను నిబంధనల ప్రకారం గుర్తించడం అధికారుల బాధ్యత అని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. విచారణ పూర్తికాకపోవడం లేదా పరిపాలనా జాప్యం కారణంగా అర్హులైన ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు బూత్ స్థాయి ఏజెంట్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికారులకు సహకరిస్తారని తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి, పెండింగ్ విచారణలను వేగవంతం చేసి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రక్రియను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పెండింగ్ ఓటర్ల విచారణ సత్వరమే పూర్తి చేయాలి



మదనపల్లె, సెప్టెంబరు 3 (మనస్సాక్షి): ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న ఓటర్ల విచారణను వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు భద్రంగా ఉండేలా చూడాలని తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులను కోరారు. మదనపల్లె జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్‌ఖాన్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణాచారి పాల్గొన్నారు. జిల్లాలో 1,31,085 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు 93,271 మంది ఓటర్ల విచారణ పూర్తయిందని అధికారులు వెల్లడించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. మిగిలిన విచారణను త్వరితగతిన పూర్తి చేసి, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

# ఇంటింటికీ తెలుగుదేశంతో పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం



మదనపల్లె, (మనస్సాక్షి) : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధినాయకత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజలతో మమేకమై వారి కష్టసుఖాలను తెలుసుకునేందుకు చేపట్టిన 'ఇంటింటా తెలుగుదేశం' కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతోంది. కార్యక్రమంలో భాగంగా 42వ రోజు గురువారం మదనపల్లె పట్టణంలోని 28, 29, 30 వార్డుల్లో ఎమ్మెల్యే షాజహాన్ బాషా స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు, పార్టీ శ్రేణులు మంగళహారతులు, జయజయధ్వానాలతో ఘనస్వాగతం పలికారు. వార్డుల్లో ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించడంతో పాటు స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో అభివృద్ధికి నోచుకోని మదనపల్లె పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో అభివృద్ధి పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సీటీఎం రోడ్డులో రూ.2 కోట్లతో రహదారి విస్తరణ పనులు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు. కదిరి రోడ్డులో డ్రైనేజీ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న ప్రజల విజ్ఞప్తి మేరకు కోట్లాది రూపాయలతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేస్తున్నామని చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన ట్యాంకర్లు ఏర్పాటు చేయడంతో పాటు కొత్త బోర్లు వేయించి ప్రజల నీటి కష్టాలను తీరుస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకుడు ఫ్రూట్ మండి సర్దార్, టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, నవీన్ చౌదరి, పట్టణ అధ్యక్షుడు అరుణ్ తేజ్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ, గంగారపు రామ్మూర్తినాయుడు, బొమ్మిశెట్టి పురుషోత్తం, మస్తాన్, రఫీ, డాన్స్‌రెడ్డి, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, బిల్డర్ రామకృష్ణ, సీనియర్ నాయకులు మోడెం సిద్ధప్ప, మార్పురీ గాంధీ, నీలకంఠ, కె.వి. నాగరాజు, పద్మమ్మ, జాఫరున్నిషా, మాజీ కౌన్సిలర్ రాధా, పులి మహాలక్ష్మి, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజ్‌కుమార్, వేమయ్య, కొప్పుల హరినాథ్, న్యాయవాది శైలజ, సికిందర్, ఇక్బాల్, టపాసుల బాబా, నాసిర్, షేక్ లతీఫ్, పోతబోలు వెంకటేష్, టౌన్ బ్యాంక్ సోమశేఖర్‌నాయుడు, మెడికల్ షాపు రమేష్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, బాలమాలి శేఖర్, ఫిర్దోస్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి గ్రామపంచాయతీలో జోరుగా ఇంటింటికీ తెలుగుదేశం



సిద్ధవటం, సెప్టెంబరు 3 (మనస్సాక్షి): రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్‌రాజు ఆదేశాల మేరకు పెద్దపల్లి గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ముమ్మరంగా సాగింది. గురువారం బూత్ నంబర్లు 24, 25, 28 పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలను ఆరా తీశారు. గ్రామపంచాయతీలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు కుటుంబ సభ్యులతో కలిసి తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఇలాంటి ప్రభుత్వాన్ని గతంలో ఎన్నడూ చూడలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మరింత కాలం కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సిద్ధవటం మండల క్లస్టర్ ఇన్‌చార్జి రాజానాయుడు మాట్లాడుతూ పెద్దపల్లి గ్రామంలో 25, 28, 40 బూత్‌లలో ఇంటింటి ప్రచారం పూర్తయిందని తెలిపారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, ఎక్కడికి వెళ్లినా తెలుగుదేశం పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ఇదే ఉత్సాహాన్ని రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ కొనసాగించి కూటమి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. పిల్లలు, పెద్దలు 'జై తెలుగుదేశం.. జై కూటమి ప్రభుత్వం' అంటూ నినాదాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో కూటమి విజయదుందుభి మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిద్ధవటం మండల క్లస్టర్ ఇన్‌చార్జి రాజానాయుడు, రాజంపేట నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు చెంచయ్యనాయుడు, పెద్దపల్లి సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్‌నాయుడు, మండల ఐటీడీపీ అధ్యక్షుడు హరిప్రసాద్, భాకరాపేట యూనిట్ కన్వీనర్ సుబ్బరాజా, బూత్ కన్వీనర్ ఓబులేసు, మండల కమిటీ సభ్యుడు రెడ్డయ్య, బాలనరసింహులు, పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు



మదనపల్లె, సెప్టెంబరు 3 (మనస్సాక్షి): కేసీ గుప్తా జయంతి, వాసవి వారోత్సవాల్లో భాగంగా మదనపల్లె వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు వీవీ కృష్ణారావు తెలిపారు. పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయం ఎదుట ఉన్న బాలసదన్‌లో విద్యార్థులకు అల్పాహారం, తినుబండారాలు అందజేశారు. అదే విధంగా శ్రీకృష్ణ మున్సిపల్ నమూనా ప్రాథమిక పాఠశాలలో సుమారు వంద మంది విద్యార్థులకు సాయివాసవి దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ నరేష్, డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించారు. వైద్యుల సూచనల మేరకు విద్యార్థులకు పళ్లపొడి, దంతపు బ్రష్‌లతో పాటు తినుబండారాలను అందజేశారు. విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై సూచనలు, సలహాలు అందించిన వైద్యులకు కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో కార్యదర్శి వినయ్‌కుమార్, కోశాధికారి కోట చంద్రశేఖర్‌గుప్తా, జిల్లా అధికారి అక్కిశెట్టి శ్రీనాథ్, పూర్వ అధ్యక్షులు పులి రాజ్ ఆనంద్, రాచపల్లి రాజేష్, రాచపల్లి రాఘవేంద్ర, సూర్య విజయ్‌కుమార్, సీనియర్ ఉపాధ్యక్షుడు బి.కె. అనిల్‌కుమార్, సభ్యులు పి. మునిరాజు, వై. సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కడప మనస్సాక్షి
PRGI Reg No: APTEL/28/A0309
తెలుగు దినపత్రిక
KADAPA MANASSAKSHI - Telugu Daily



# ఆధునిక హంగులతో ప్రొద్దుటూరు ఎస్‌డీపీఓ కార్యాలయం

**-పునరుద్ధరించిన కార్యాలయాన్ని ప్రారంభించిన ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్**

**-పోలీసులకు మెరుగైన పని వాతావరణం.. ప్రజలకు మెరుగైన సేవలు**

**-కార్యాలయ పునరుద్ధరణకు దాతల సహకారం అభినందనీయం**




ప్రొద్దుటూరు, (మనస్సాక్షి) : పోలీసు అధికారులు, సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించడంతో పాటు సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు సౌకర్యాలు అందించేందుకు ఆధునిక హంగులతో పునరుద్ధరించిన ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ (ఎస్‌డీపీఓ) కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ గురువారం ప్రారంభించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. ప్రకాష్‌బాబు, ప్రొద్దుటూరు ఏఎస్పీ యు. విబు కృష్ణతో పాటు సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పోలీసుశాఖలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో భాగంగా ఎస్‌డీపీఓ కార్యాలయాన్ని ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించారు. అధికారులు, సిబ్బంది విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అనువైన వాతావరణం కల్పించడంతో పాటు పోలీసు సేవల కోసం వచ్చే ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే పునరుద్ధరణ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. కార్యాలయ పునరుద్ధరణ పనులకు ప్రొద్దుటూరులోని స్వరూప్ ఐ హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ వై.వి. స్వరూప్‌కుమార్‌రెడ్డి ప్రధానంగా ఆర్థిక సహకారం అందించారు. పోలీసుశాఖ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆయన అందించిన సహకారాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే వి. జయచంద్రరెడ్డి (సీబీఐటీ), డాక్టర్ కె.వి.ఆర్. ప్రదీప్‌రెడ్డి, డాక్టర్ ఎన్. నాగార్జునయాదవ్, దండపాణి శ్రీనివాసకుమార్, నాగూర్‌బాషా (జీఐటీ), ఎస్. నాగిరెడ్డి (ఏజీఎం, ఎస్‌సీఎస్), చెన్న శ్రీనివాసులు, కె. గంగిరెడ్డి, పి. మహేశ్వర్‌రెడ్డి, పి. రాజేష్‌రెడ్డి, ఎం. శంకర్‌రెడ్డి తదితరులు ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రజలు, ప్రముఖులు, దాతలు, శ్రేయోభిలాషులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. సమాజంలోని వివిధ వర్గాల సహకారంతో పోలీసులకు మెరుగైన పని పరిస్థితులు కల్పించడంతో పాటు ప్రజలకు మరింత సమర్థవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రధాన దాత డాక్టర్ వై.వి. స్వరూప్‌కుమార్‌రెడ్డి అందించిన సహకారాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యాలయ పునరుద్ధరణకు సహకరించిన ఇతర దాతలు, శ్రేయోభిలాషులకు పోలీసుశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ యు. విబు కృష్ణ చొరవతో కార్యాలయ పునరుద్ధరణ పనులు చేపట్టారు. దాతలు, పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి కార్యాలయానికి ఆధునిక రూపాన్ని కల్పించారు. ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించేందుకు అవసరమైన సౌకర్యాల కల్పనలో ప్రజా భాగస్వామ్యం ఎంతో దోహదపడుతుందని పోలీసు అధికారులు పేర్కొన్నారు. పునరుద్ధరణకు సహకరించిన ప్రధాన దాతతో పాటు ఇతర దాతలు, శ్రేయోభిలాషులకు పోలీసుశాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# జమ్మలమడుగు రూపురేఖలు మార్చేలా అభివృద్ధి

**-తాగునీరు, రోడ్లు, డ్రైనేజీకి ప్రాధాన్యం**

**-రూ.25 కోట్ల పనులు వేగవంతం చేయాలి**

**-అధికారులకు కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశం**

కడప, సెప్టెంబరు 3 (మనస్సాక్షి): జమ్మలమడుగు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డి, జేసీ డా. నిధి మీనాతో కలిసి జమ్మలమడుగు మున్సిపాలిటీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన సమీక్షించారు. పట్టణంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాలు, గృహ నిర్మాణాలు, విద్యుత్, పట్టణ ప్రణాళికపై సమీక్షించారు. ప్రస్తుతం రోజుకు 7.14 మిలియన్ లీటర్ల నీటి అవసరం ఉండగా అంతే స్థాయిలో సరఫరా జరుగుతోందని అధికారులు తెలిపారు. మైలవరం, పెన్నా నదుల నుంచి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. అమృత్–2.0 కింద మంజూరైన తాగునీటి పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.25 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధి పనుల టెండర్లను త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణంలో అవసరమైన 207.84 కిలోమీటర్ల డ్రైనేజీకి ప్రస్తుతం 68.23 కిలోమీటర్లు మాత్రమే ఉన్నందున మిగిలిన ప్రాంతాలకు దశలవారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రోజుకు 22 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో తడి, పొడి చెత్తను వేరు చేసి శాస్త్రీయంగా నిర్వహించాలని సూచించారు. మురుగునీటి శుద్ధి కేంద్రం, పదార్థాల పునర్వినియోగ కేంద్రం పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పట్టణ విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి ప్రతిపాదించిన రూ.60 కోట్ల అభివృద్ధి పనుల టెండర్లను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. పెద్దపసుపుల రోడ్డులో నిర్మించనున్న పట్టణ ఆరోగ్య కేంద్రం పనులను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎన్టీఆర్ గృహ పథకం కింద నిర్మాణంలో ఉన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయడంతో పాటు గృహ లేఅవుట్లలో రోడ్లు, నీరు, డ్రైనేజీ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. మాస్టర్ ప్లాన్, ఎల్‌ఆర్‌ఎస్, భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పట్టణంలో విస్తృతంగా మొక్కలు నాటి డ్రిప్ ద్వారా నీరందించాలని ఆదేశించారు. జమ్మలమడుగు జెడ్పీ మెయిన్ పాఠశాలతో పాటు తాళ్లప్రొద్దుటూరు, కొండాపురం ఉన్నత పాఠశాలలను అన్ని సౌకర్యాలతో ఆదర్శ పాఠశాలలుగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. పట్టణ అభివృద్ధికి జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జమ్మలమడుగు స్థానిక నాయకులు భూపేష్‌రెడ్డి, ఆర్డీవో శిరీష, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, డీపీవో రామకృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.





# యర్రగుంట్ల అభివృద్ధికి కార్యాచరణ

**-రూ.139.68 కోట్ల తాగునీటి పథకంపై ప్రత్యేక దృష్టి**

**-పన్ను వసూళ్లు పెంచాలి.. గుంతలు, డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి**

**-అధికారులకు కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశం**




కడప, సెప్టెంబరు 3 (మనస్సాక్షి): యర్రగుంట్ల మున్సిపాలిటీని సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో యర్రగుంట్ల మున్సిపాలిటీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డి, జేసీ డా. నిధి మీనా సమావేశానికి హాజరయ్యారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ఆదాయ వనరులు, తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, గృహ నిర్మాణాలు, పట్టణ ప్రణాళిక తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రస్తుత మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీ ఆదాయ వనరులపై సమీక్షించిన కలెక్టర్ పన్ను వసూళ్ల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఆస్తి పన్ను వసూళ్లు 26.56 శాతం, ప్రైవేటు ఆస్తుల పన్ను వసూళ్లు 39.69 శాతం మాత్రమే ఉండటాన్ని ప్రస్తావించారు. బకాయిలను గుర్తించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ వంద శాతం పన్ను వసూళ్ల లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. యర్రగుంట్ల పట్టణానికి భవిష్యత్ అవసరాలకు సరిపడా తాగునీరు అందించేందుకు ప్రతిపాదించిన రూ.139.68 కోట్ల ఏఐఐబీ పథకంపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. గండికోట వద్ద నీటి సేకరణ బావి, రోజుకు 80 లక్షల లీటర్ల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రం, మూడు ఎత్తిపోతల నీటి నిల్వ కేంద్రాలు, 42.22 కిలోమీటర్ల ప్రధాన నీటి పైపులైన్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైన భూముల కేటాయింపును అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. పట్టణంలోని రహదారుల పరిస్థితిపై ఆరా తీసిన కలెక్టర్ గుర్తించిన 60 గుంతలను రూ.4.30 లక్షలతో చేపడుతున్న మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కొనసాగుతున్న 28 రహదారి పనులు, 13 డ్రైనేజీ పనులు, 28 నీటి సరఫరా పనులను నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి హామీ కింద ప్రతిపాదించిన సీసీ రోడ్లు, డ్రైన్లు, నీటి సరఫరా, కమ్యూనిటీ హాల్, నీటి ప్లాంట్ తదితర రూ.13 కోట్ల పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యర్రగుంట్లలో రోజుకు సుమారు 16 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతున్నందున తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కడప రోడ్డు డంప్‌యార్డులో పేరుకుపోయిన 6,227 టన్నుల పాత చెత్తను బయో–రెమిడియేషన్ ద్వారా తొలగించే పనులను వేగవంతం చేయాలన్నారు. వీధి కుక్కల నియంత్రణకు చేపడుతున్న శస్త్రచికిత్సలను నిబంధనల మేరకు కొనసాగించాలని సూచించారు. టిడ్కో కింద నిర్మించిన 1,584 ఇళ్లలో 1,448 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రకాశ్‌నగర్‌లో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద 1,154 ఇళ్లకు గాను 278 ఇళ్లు పూర్తికాగా, 876 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు వివరించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వసతులను సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ దరఖాస్తులను నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. భవన నిర్మాణ అనుమతులను నిర్ణీత సమయంలో మంజూరు చేయడంతో పాటు పట్టణ విస్తరణకు అనుగుణంగా ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. యర్రగుంట్లలో 656 స్వయం సహాయక సంఘాల్లో 6,230 మంది సభ్యులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అర్హత కలిగిన మరిన్ని సంఘాలకు బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పీఎం స్వనిధి పథకం ద్వారా వీధి వ్యాపారులకు అందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్యే సి. ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ యర్రగుంట్ల వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అభివృద్ధి ప్రతిపాదనలను ప్రభుత్వ స్థాయిలో ముందుకు తీసుకెళ్లేందుకు తన సహకారం అందిస్తానని తెలిపారు. శాఖల వారీగా బాధ్యతలు నిర్దేశించుకుని పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే పనులకే తొలి ప్రాధాన్యం ఇచ్చి, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జమ్మలమడుగు స్థానిక నాయకులు భూపేష్‌రెడ్డి, ఆర్డీవో శిరీష, యర్రగుంట్ల మున్సిపల్ కమిషనర్ శేషఫణి, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలి



మంగళగిరి, (మనస్సాక్షి): సమాచార హక్కు చట్టంపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నేతి నాగేష్ కోరారు. గురువారం మంగళగిరిలోని సమాచార హక్కు కమిషన్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ గాజుల ఆదెన్నను మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతి నాగేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లోని సమాచారాన్ని ప్రజలు పొందే అవకాశం ఉందని, తద్వారా ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని తెలిపారు. అయితే ఈ చట్టంపై ఇప్పటికీ అనేక మంది ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో తమకు అందుబాటులో ఉన్న హక్కును సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ ప్రజలకు సమాచార హక్కు చట్టం ద్వారా కలిగే ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, హక్కులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ప్రజలు తమ హక్కులపై అవగాహన పెంచుకున్నప్పుడే ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత బలోపేతం అవుతాయని నేతి నాగేష్ పేర్కొన్నారు.

# వేరుశనగ పంటలో పొలం బడి కార్యక్రమం

**-రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతులపై రైతులు మొగ్గు చూపాలి**

**-ఎకరానికి 200 కిలోల జిప్సం వాడితే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చు: వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి**



ముద్దనూరు, (మనస్సాక్షి): వేరుశనగ పంటలో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి రైతులకు మెరుగైన ఆదాయం వచ్చేలా చేయడమే పొలం బడి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామంలో నిర్వహించిన పొలం బడి కార్యక్రమంలో రైతులతో కలిసి వేరుశనగ పంట పొలాన్ని పరిశీలించి పంట పరిస్థితిని విశ్లేషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంలో మిత్ర పురుగుల సంఖ్య తక్కువగా, శత్రు పురుగుల సంఖ్య అధికంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ముఖ్యంగా రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందని, వాటి నివారణకు పసుపు రంగు జిగురు అట్టలను పొలంలో ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. వేరుశనగ పంట పూత, ఊడలు దిగే దశలో ఎకరానికి 200 కిలోల జిప్సం చల్లి నీరు పెట్టుకోవాలని సూచించారు. జిప్సం వేసిన తర్వాత పొలంలో తప్పనిసరిగా తేమ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ విధంగా చేయడం వల్ల పూత, పిందెలు, ఊడలు బాగా ఏర్పడి గట్టి కాయలు తయారవుతాయని, గింజ నాణ్యతతో పాటు నూనె శాతం పెరిగి మంచి దిగుబడులు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే పొలంలో ఇనుప ధాతు లోప లక్షణాలను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. తిక్క ఆకు మచ్చ తెగులు లక్షణాలను గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని, విత్తే సమయంలో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవడంతో పాటు తెగుళ్లను తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతులను అనుసరించి పంటలు సాగు చేయడమే పొలం బడి కార్యక్రమం అంతిమ లక్ష్యమని వ్యవసాయ అధికారి తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి రైతుల ఆదాయాన్ని పెంచేందుకు శాస్త్రీయ పద్ధతులను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు జి. నాగమణి, రైతులు బి. ప్రభాకర్ రెడ్డి, ఎన్. ఈశ్వర రెడ్డి, శంకర రెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఆర్కే వ్యాలీ ప్రాంగణంలో అధ్యాపకులకు అదనపు బాధ్యతలు



ట్రిపుల్ ఐటీ, (మనస్సాక్షి): ఆర్కే వ్యాలీ ప్రాంగణంలో పలువురు అధ్యాపకులకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యాపక బాధ్యతలను కొనసాగిస్తూనే వారికి కేటాయించిన అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నట్లు అధికారులు తెలిపారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం. భాస్కరయ్యను పరిశోధన, అభివృద్ధి విభాగంతో పాటు ఉన్నత విద్య, పోటీ పరీక్షల విభాగాల సమన్వయకర్తగా నియమించారు. జీవశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఏ. జోబ్ రోజర్ బిన్నీకి స్థాపన విభాగం సమన్వయకర్తగా, రసాయన శాస్త్ర విభాగాధిపతి ఏ.వి. దుర్గా కిషోర్‌రెడ్డికి సహాయ స్థాపన సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించారు. గణితశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ జె. దీప్తిని ప్రధాన భోజనశాల సమన్వయకర్తగా, గ్రంథాలయ విభాగ సహాయ గ్రంథపాలకుడు డాక్టర్ డి. కోనప్పను అంతర్గత నాణ్యతా హామీ విభాగం సమన్వయకర్తగా నియమించారు. కంప్యూటర్ శాస్త్ర విభాగ అధ్యాపకురాలు పి. ఉదయశ్రీకి పూర్వ విద్యార్థుల వ్యవహారాలు, విస్తరణ కార్యక్రమాల సమన్వయకర్తగా, నిర్వహణ విభాగ అధ్యాపకుడు డాక్టర్ కే. కళ్యాణ్ చక్రవర్తికి సమాచార హక్కు చట్ట విభాగ సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సమాచార సాంకేతిక విభాగంలో మార్గదర్శకుడిగా పనిచేస్తున్న ఎస్. రామకృష్ణను సంచాలకుడి వ్యక్తిగత సహాయకుడిగా నియమించారు. మహబూబ్ భాషాకు ప్రజా సంబంధాలు, ప్రచారం, ప్రసార మాధ్యమాల సమాచార మార్పిడిని సమన్వయం చేసే బాధ్యతను అప్పగించారు. అదనపు బాధ్యతలు స్వీకరించిన అధ్యాపకులను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# శ్రీ కృష్ణాష్టమికి శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం ముస్తాబు



వేంపల్లి, (మనస్సాక్షి): స్థానిక నాలుగో రోడ్డులో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీ కృష్ణాష్టమి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి. వెంకటరమణ, కార్యనిర్వహణాధికారి సుభాష్ పర్యవేక్షణలో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచే శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారు శ్రీ కృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అర్చకులు హరి ప్రవీణ్, తిరుమల వేణు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, ఆరాధనా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకుని చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పి. వెంకటరమణ మాట్లాడుతూ పావనమైన శ్రీ కృష్ణాష్టమి పర్వదిన వేడుకల్లో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని, శ్రీ కృష్ణ అవతారంలో దర్శనమిచ్చే శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని కోరారు.

# పొలాలకు రోడ్లు వేయించాలి



వేంపల్లి, (మనస్సాక్షి): ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలని భాజపా కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్ కోరారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్‌తో కలిసి వేంపల్లి మండలం బక్కన్నగారిపల్లెలో వ్యవసాయ పొలాలకు వెళ్లే దారులను పరిశీలించారు. గిరిజన తండాల రైతులు సాగు చేస్తున్న పొలాలకు సరైన రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. పంటలను మార్కెట్‌కు తరలించేందుకు రవాణా మార్గం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని, వర్షం కురిసిన సమయంలో పొలాలకు వెళ్లడం కూడా కష్టంగా మారుతోందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలను పరిశీలించి, ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ పొలాలకు తక్షణమే రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భాజపా ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవియాదవ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలపై పోలీసుల సూచనలు



యర్రగుంట్ల, (మనస్సాక్షి): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు యర్రగుంట్ల పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. యర్రగుంట్ల పోలీస్ స్టేషన్‌లో సీఐ విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఐ నాగమౌళి ఆధ్వర్యంలో మండల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి ఉత్సవాల నిర్వహణ, అనుమతులు, భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేశారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠ, ఊరేగింపులకు ముందస్తుగా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పోలీసులు సూచించారు. ఉత్సవాల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం లేకుండా కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలని కోరారు. విద్యుత్ భద్రత, ధ్వని కాలుష్యం, ఊరేగింపు మార్గాలు, మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో మండల గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొని పోలీసులకు సహకరిస్తామని హామీ ఇచ్చారు.

# చైతన్య ఉన్నత పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు





వేంపల్లి, (మనస్సాక్షి): వేంపల్లి చైతన్య ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాఠశాల చైర్మన్ బి. చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం ప్రతి ఒక్కరికీ ధైర్యం, ధర్మం, కర్తవ్యనిష్ఠ, సత్య మార్గంలో నడిచేందుకు స్ఫూర్తినిస్తుందని తెలిపారు. విద్యార్థులు పండుగల విశిష్టతను తెలుసుకోవడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. ఉపాధ్యాయులు శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టత, శ్రీకృష్ణుడి బోధనలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల నృత్యాలు, నాటికలు, ప్రసంగాలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ఐక్యతను పెంపొందిస్తాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొనడంతో వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరితంగా జరిగాయి.

Editor, Printed, Published and Owned by VASANTHA SREENIVASULA REDDY, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 51600. RNI REG NO:- APTEL/26/A0309.
Printed at. VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, Y.S.R., ANDHRA PRADESH - 516002. Editor: VASANTHA SREENIVASULA REDDY, E-mail: sreenu1167@gmail.com, Cell: +91 8341698284